సిరులు కురిపించిన టమాట


మార్కెట్‌కు తరలించడానికి టమాటాలను తొలగిస్తున్న కూలీలు


టమాటలను బాక్స్‌ల్లో నింపుతున్న దృశ్యం

- ఎకరాకు రూ.10 లక్షలకు పైగా ఆదాయం
- మడకశిర డివిజన్‌లో 575 ఎకరాల్లో సాగు

మడకశిరరూరల్: సంవత్సరాలుగా సాగు చేస్తున్నా ఎన్నడూ లాభాలు పంచని టమాట ఈ ఏడాది మాత్రం అన్నదాతలను లక్షాధికారులను చేసింది. గత నెలలో ఆకాశాన్నంటిన ధరలు 15 రోజుల వరకు అదే ఊపుతో కొనసాగాయి. ఎండలకు పూత మాడిపోతుందని తెలిసినా ఏప్రిల్ మాసంలో సాగు చేసిన పంట అన్నదాతలకు సిరులు కురిపించింది. ఒక్కోరైతు ఎకరాకు రూ. 10 లక్షల వరకు లాభం వచ్చింది. నియోజకవర్గం లోని మడకశిరలో 220 ఎకరాలు, రొళ్లలో 40, గుడిబండలో 130, అమరాపురంలో 150, అగళిలో 35 ఎకరాల చొప్పున 575 ఎకరాల్లో టమాట సాగైంది.

ప్రకృతి సేద్యం విధానంలో సాగు



బోరుబావి కింద నాలుగు ఎకరాల్లో సాహో రకం టమాటను ప్రకృతి సేద్యం విధానంలో సాగు చేశా. బాక్స్‌కు 14 కేజీల చొప్పున ఎకరాకు 2 వేల బాక్స్‌లు దిగుబడి లభించింది. ఒక బాక్స్ రూ.1,600 నుంచి రూ. 2,200 వరకు విక్రయించా. ఇప్పటికే రూ.25 లక్షల ఆదాయం లభించింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధర 20 రోజుల పాటు కొనసాగితే రూ.40 లక్షలకు పైగా ఆదాయం లభించే అవకాశం ఉంది. – దివాకర్, మడకశిర మండలం చందకచెర్లు

కృష్ణా జలాలు తెచ్చింది వైఎస్సార్‌సీపీనే

- సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సీఎం జగన్ శ్రమిస్తున్నారు
- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

గుడిబండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతాంగానికి అండగా నిలిచి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నారని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. సాగునీటి పథకాలను పూర్తి చేయించేందుకు శ్రమిస్తున్నారన్నారు. అయితే టీడీపీ నేతలు కుట్రలు పన్ని ప్రాజెక్టుల సందర్శన పేరుతో కపటనాటకానికి తెరతీశారని ఆరోపించారు. మూడు రోజుల క్రితం జిల్లాలోని తెలుగుదేశం పార్టీ నాయకులు మండలంలోని రాళ్లపల్లి గ్రామ సమీపంలో పర్యటించి ముదిగుబ్బ రిజర్వాయర్ నిర్మించాలని డిమాండ్ చేశారన్నారు. వాస్తవానికి తాను ఇప్పటికే ముదిగుబ్బ రిజర్వాయర్ నిర్మించడానికి రూ.150 కోట్లు మంజూరు చేయించానన్నారు. సర్వేయర్లను తీసుకొని వస్తే పనులను తెలుగుదేశం నాయకులు అడ్డగించారన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా బైపాస్ కెనాల్ తవ్వకం కోసం సీఎం జగన్ రూ.214 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ పనులను ముఖ్యమంత్రి త్వరలో ప్రారంభిస్తారన్నారు. హంద్రీనీవా జలాలు మడకశిర నియోజకవర్గానికి తెచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. 2024లో జరిగే శాసనసభ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ రాధమ్మ, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచ్‌లు యంజారేగౌడు, రంగస్వామి, జగదాంబ, ఎంపీటీసీలు రత్నమ్మ, సుశీల, మండల సచివాలయ కన్వీనర్ కె.శివకుమార్, మండల బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్ పాండు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జెండా ఎగుర వేసిన ఎమ్మెల్యే


జాతీయ జెండాను ఎగుర వేస్తున్న ఎమ్మెల్యే

పెనుకొండ: హర్‌ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గురువారం తన స్వగృహంలో జెండా ఎగురవేశారు. స్వాతంత్ర్యదినాన్ని పురస్కరించుకొని అన్ని ఇళ్లపై, అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలు ఎగురవేసేలా జెండాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు ఎమ్మెల్యేకు విన్నవించారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న సమన్వయకర్త దీపిక, కౌన్సిలర్ పార్వతి

హిందూపురం: ప్రజలకు సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. పట్టణంలోని 10వ వార్డు లక్ష్మీపురంలో డీఆర్ కాలనీ నుంచి గోకుల్‌నగర్ వరకు రూ.33 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు కౌన్సిలర్ పార్వతీతో కలిసి భూమిపూజ చేశారు. దీపిక మాట్లాడుతూ అన్ని వార్డుల్లో ప్రజల సౌకర్యం కోసం అవసరమైన అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్, షాజియా, మనీ, నాగేంద్రబాబు, చంద్ర, గిరి, మల్లికార్జున, రోషన్‌అలీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయకార్యదర్శి హనుమంతరెడ్డి, నాగరాజు, దాదు, మహేష్,శ్రీరాంరెడ్డి, రవీంద్రుడు, కృష్ణగౌడ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలుగా గుర్తించాలి


నిరసన చేపడుతున్న క్రైస్తవులు

హిందూపురం టౌన్: దళితులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే ఎస్సీలుగానే గుర్తించాలని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ కోరారు. గురువారం స్థానిక సీఅండ్‌ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో భారత క్రైస్తవుల జాతీయ నిరసన దినాన్ని చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ అభివృద్ధికి దూరంగా ఉన్న క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి సామాజిక స్థితిగతులను మార్చి అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి కృషి చేయాలన్నారు. ఉదయ్‌కుమార్, సూర్య ప్రకాష్, ఇజ్రాయిల్ రాజ్, పాల్ తిమోతి, దేవరాజ్, డేవిడ్, స్టీఫెన్‌రాజ్, విక్టర్ జాషువా, ఆనంద్ రాజ్, ఆంజనేయులు, డానియల్ పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన

హిందూపురం టౌన్: దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా ఆల్ ఇండియా గ్రామీణ తపాలా సేవా ఉద్యోగులు గురువారం స్థానిక తపాలా కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వీరికి సీఐటీయూ నాయకులు రాము, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్‌లు మద్దతు తెలిపారు. పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు సర్వీస్ అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అబ్దుల్ మున్నా, నరసింహులు, ప్రభాకర్, నాగరాజు, జనార్ధన్, శ్రీనివాసులు, రామాంజినేయులు, కొల్లప్ప, గంగాధర్, రామచంద్రరావు, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం


ముద్దరాజును సన్మానిస్తున్న దృశ్యం

అగళి: 'అఖిల భారత ఇండియా సర్పంచ్‌ల సంఘం' డైరెక్టర్‌గా ఎన్నికైన హళ్లికెర సర్పంచ్ ముద్దరాజును గురువారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

తేనీటి విందు


కార్యక్రమంలో పాల్గొన్న మధుమతిరెడ్డి

హిందూపురం అర్బన్: వైకాపా నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి ఇచ్చిన తేనీటి విందులో పాల్గొన్నారు. నాగభూషణం రెడ్డి, ఎంపీపీ రత్నమ్మ, జెడ్పీటీసీ నాగభూషణ, నాయకులు రామాంజి పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సమష్టిగా కృషి

అమరాపురం: మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎంపీడీఓ మునిస్వామి,ఎంపీపీ ఈరన్న పిలుపునిచ్చారు. పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాఖల వారీగా ప్రగతి వివరాలను అధికారులు సభలో వివరించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సభ్యులు లక్ష్మీదేవి, నారాయణప్ప మాట్లాడుతూ అమరాపురం పీహెచ్‌లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అమరాపురం నుంచి కర్ణాటక సరిహద్దు వరకు ఆగిపోయిన రహదారి పనులను వెంటనే చేపట్టాలని సభ్యులు కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులకు పథకాలు అందించాలన్నారు. తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంఈఓ వెంకటరమణనాయక్, ఏపీఓ గోపాల్, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

మడకశిరరూరల్: స్థానిక బాలికోన్నత పాఠశాలలో గురువారం ఐసీడీఎస్, ఆర్డీటీ ,పోలీసు శాఖల సహకారంతో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ముర్షావలి మాట్లాడుతూ యుక్త వయస్సు రాకుండానే వివాహాలు చేస్తే వారి జీవితాలు అంధకారమవుతాయన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యావంతులను చేయడంపై దృష్టి సారించాలన్నారు. సీడీపీఓ నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి


శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: మార్కెట్ యార్డ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పెనుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నియమితులైన కలిపి దేవాంగం శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శంకరనారాయణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీనివాసులను ఎమ్మెల్యే సన్మానించారు.కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, పెనుకొండ జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ...

అగళి: మండల పరిధిలోని రావుడి పంచాయతీ, ఆలుడి గ్రామాల్లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ బసవరాజు, ఎంపీటీసీ నింగమ్మ తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొంటారని తెలిపారు.

రాజకీయ పార్టీల నేతలతో నేడు సమావేశం

పెనుకొండ: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని స్పందన కార్యాలయంలో నియోజకవర్గపరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ గురువారం తెలిపారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ కార్తీక్ పాల్గొంటారన్నారు. ఇంటింటికీ ఓటర్ల పరిశీలన, ఇతర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు.

కారు బోల్తా

చిలమత్తూరు: మండలంలోని 544–ఈ జాతీయ రహదారి వడ్డిచెన్నంపల్లి వద్ద కారు బోల్తా పడి ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. కర్ణాటకలోని మారానుగుంటకు చెందిన మనోజ్ గురువారం కారులో హిందూపురం వైపు నుంచి చెక్‌పోస్ట్ వైపు వెళ్తూ వడ్డిచెన్నంపల్లి సమీపంలోకి రాగానే డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో మనోజ్‌కు స్వల్పగాయాలు కాగా, కారు నుజ్జునుజ్జు అయ్యింది

అట్టహాసంగా నామినేషన్ దాఖలు


ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు ఉపేంద్రరెడ్డి, చిత్రంలో పార్టీ సమన్వయకర్త దీపిక


ర్యాలీగా వస్తున్న ఉపేంద్ర రెడ్డి

హిందూపురం: చలివెందల పంచాయతీని అన్నిరకాలుగా అభివృద్ధి చేపట్టి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక, చలివెందల పంచాయతీ గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఉపేంద్రరెడ్డి అన్నారు. చలివెందల పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుగా ఉపేంద్రరెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. ఉపేంద్రరెడ్డి ఓపెన్ టాప్ జీపులో పార్టీ శ్రేణులతో కలిసి ఊరేగింపుగా తరలివచ్చారు. హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎస్.దీపిక, పార్టీ నాయకులు వేణురెడ్డి, మధుమతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీతో కలిసి వెళ్లి ఉపేంద్రరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. దీపిక మాట్లాడుతూ చలివెందల సర్పంచ్ సౌభాగ్యమ్మ మృతి తీరనిలోటన్నారు. ఆమె ఆశయాలు నేరవేర్చడానికి ప్రజలకు సేవలు అందించడానికి ఆమె కుమారుడు ఉపేంద్రరెడ్డిని సర్పంచ్ అభ్యర్థిగా నిలిపినట్లు తెలిపారు. అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ రత్నమ్మ, వైస్‌ఎంపీపీ రఘునాథరెడ్డి, రామాంజి, జెడ్పీటీసీలు నాగభూషణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయకార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.

ఏడు నామినేషన్లు దాఖలు..

చలివెందల గ్రామపంచాయతీ స్థానానికి ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు బి.ఉపేంద్రరెడ్డి రెండు సెట్లు నామినేషన్‌దాఖలు చేయగా అతని అభ్యర్థిత్వాన్ని అజయ్‌కుమార్, నరేష్‌లు బలపర్చారు.అలాగే లక్ష్మినారాయణరెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రతాప్‌రెడ్డి బలపరిచారు. టీడీపీ తరపున రవీంద్రారెడ్డి రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. గవిరెడ్డిగారి వెంకటరెడ్డి, మహేంద్రరెడ్డి కూడా నామినేషన్లు దాఖలు చేశారు.

వార్డు స్థానాలకు జోరుగా నామినేషన్లు

లేపాక్షి: కోడిపల్లి, పులమతి పంచాయతీల వార్డు సభ్యుల స్థానాలకు మూడు నామినేషన్లు దాఖాలు చేసినట్లు ఈఓఆర్‌డీ శివన్న గురువారం తెలిపారు. కోడిపల్లికి రెండు, పులమతికి ఒకటి చొప్పున నామినేషన్‌లు దాఖాలు చేశారన్నారు.

రొద్దం: రొద్దం పంచాయతీ 3వ వార్డుకు గురువారం ఎనిమిది నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారి కేశవరెడ్డి చెప్పారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో రొద్దకంపల్లికి చెందిన బోయ అశ్వర్థమ్మ నామినేషన్ దాఖలాలు చేశారు. ఎంపీపీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గోరంట్ల: గోరంట్ల మేజర్ పంచాయితీలోని 18 వార్డు ఉప ఎన్నికకు నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రాంభమైంది. వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడు శింగిరెడ్డిపల్లి గొల్ల నరసింహప్ప, మంజునాథ్ నామినేసన్లు దాఖలు చేశారు. తొలి రోజు మొత్తం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి సుధాకర్ తెలిపారు.

చిలమత్తూరు: మొరసలపల్లి గ్రామ పంచాయతీ 4 వవార్డు మెంబరు స్థానానికి నలుగురు అభ్యర్థులు నిలిచినట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు. సి.లక్ష్మీదేవమ్మ, సి. లక్ష్మీదేవి, వేదాంతమ్మ, జి.లక్ష్మీదేవమ్మ నామినేషన్లు వేసినట్లు తెలిపారు.

అగళి: అగళి పంచాయతీ 2వ వార్డు మెంబర్ స్థానానికి 4 నామినేషన్లు, పీ బ్యాడగెర పంచాయతీలోని కెంకెరలో 2 వార్డు మెంబర్ స్థానానికి 3 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నిల అధికారి పద్మావతి తెలిపారు.

గుడిబండ: గుణేమోరుబాగల్ పంచాయతీ 10వ వార్డు మెంబర్ స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు నాగరాజు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఎంపీపీ రాధమ్మ, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, కె.శివకుమార్, సర్పంచ్ యంజారేగౌడు పాల్గొన్నారు.

పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే సర్కార్ ధ్యేయం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి


ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి

చిలమత్తూరు: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో నులిపురుగుల మాత్రలు వేస్తున్నామని పంచాయతీరాజ్ కమిషనర్ ఎ.సూర్యకుమారి అన్నారు. కోడూరు మర్రోతోపులోని సచివాలయం వద్ద గురువారం నులిపురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరించి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. సబ్ కలెక్టర్ కార్తీక్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, వైద్యాధికారి రామకృష్ణ పాల్గొన్నారు

మడకశిరరూరల్: గుండుమల ఎంజేపీ, పీహెచ్‌సీ, కేజీబీవీ, కల్లుమర్రి పీహెచ్‌సీ, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి పరిశీలించారు. మడకశిర నియోజకవర్గంలో 49,738 పిల్లలు, విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేశామన్నారు.

పెనుకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైద్యాధికారి తిప్పేస్వామినాయక్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఎస్ఎస్ ఎస్‌పీఓ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

గుడిబండ: స్థానిక గురుకుల పాఠశాలలో 470 మంది విద్యార్థినులకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.

గోరంట్ల: మండంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పిల్లల తల్లులకు ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ వర్కర్లు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు.

సోమందేపల్లి: జూలకుంటలో హెచ్‌ఎం. శ్రీధర్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

లేపాక్షి: లేపాక్షిలోని నీలం సంజీవరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపీడీఓ నరసింహనాయుడు, వైద్యాధికారి వెంకట చిరంజీవి, ఎంఈఓ నాగరాజు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

హిందూపురం అర్బన్: బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమేష్ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

ఉత్సాహంగా 'నా భూమి- నా దేశం'


ఆగ్రహారం పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

చిలమత్తూరు: 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమంలో భాగంగా నా భూమి- నా దేశం , నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు కొనసాగాయి. విద్యార్థులు మహనీయుల జీవితచరిత్ర తెలుసుకొని దేశ భక్తిని పెంచుకుంటున్నారు. కోడూరు మర్రోతోపులోని జెడ్పీ హెచ్ పాఠశాలలో గురువారం నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, ఎంపీడీఓ నరేష్ కృష్ణ హాజరై స్వాతంత్ర్య సమరయోధులు చేసిన పోరాటాలను వివరించారు. శిలాఫలకం వద్ద కోడూరుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు వెంకటచలపతిరావుకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి మొక్కలు నాటారు. ఎంపీటీసీలు మంజునాథ్‌రెడ్డి, ఆదినారాయణ, సింగిల్ విండో చైర్మన్ హనుమంతరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మెన్ అశ్వర్థరెడ్డి పాల్గొన్నారు.

రొళ్ల: కాకి, దొడ్డేరి పంచాయతీ కేంద్రాల్లో ప్రాథమిక పాఠశాలల ఆవరణలో జాతీయ జెండాను ఎగుర వేసి మొక్కలు నాటారు. సర్పంచ్ లక్ష్మమ్మ, వైఎస్ సర్పంచ్ రాజు, బసవరాజు, లోకేష్, గోవిందరాజు, యర్రగుంటప్ప, ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్ పాల్గొన్నారు.

గోరంట్ల: బూదిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ రామాంజినేయులు ఆధ్వర్యంలో తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రఘునాథగుప్త, హెచ్‌ఎం జనార్ధనరెడ్డి పాల్గొని మొక్కలు నాటారు.

గుడిబండ: హిరేతుర్పి ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీఓ రామారావు, జెడ్పీటీసీ భూతరాజు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. సర్పంచ్ గౌరమ్మ, ఏపీఓ భార్గవి పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: అడదాకులపల్లి, నాగళూరు, మావటూరు గ్రామాల్లో పాఠశాలల ఆవరణంలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఎంపీడీఓ శివశంకరప్ప, తహసీల్దార్ స్వర్ణలత, ఈవోఆర్‌డీ శ్రీదేవి, ప్రత్యేక అధికారులు నాగేంద్ర, శ్రీనాథ్ పాల్గొన్నారు.

అమరాపురం: వీ ఆగ్రహారం, వలస, హేమావతి పంచాయతీల కేంద్రాల్లో గురువారం అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఖాళీ ప్రదేశాలు, పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటి నీరు పోశారు.

మడకశిరరూరల్: బుళ్లసముద్రం, గోవిందాపురం, గుండుమల, జీవీపాళ్యం పంచాయతీల్లో అధికారులతో కలిసి ప్రజా ప్రతినిధులు ఖాళీ ప్రదేశాలు, పాఠశాల ఆవరణల్లో మొక్కలు నాటారు. ఎంపీడీఓ సోనిబాయి, ఏపీఓ శ్రీకాంత్‌గౌడు పాల్గొన్నారు.

అగళి: మధుడి, ఇనగలూరు, హళ్లికెర పంచాయతీలలో మొక్కలు నాటారు. ఎంఈఓ2 చంద్రశేఖర్, ఏపీఓ సురేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఫెయిల్ అయిన విద్యార్థులకు రీ అడ్మిషన్లు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు రీ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు సుధామణి గురువారం తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రగతి పత్రాలను పంపిణీ చేశారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు

పావగడ: స్థానిక క్రీడా మైదానంలో విద్యార్థుల క్రీడా పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. గురువారం నిర్వహించిన ఖోఖో పోటీల్లో అరసికెర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి తాలూకా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. వ్యక్తిగత విభాగం పరుగు పందెంలో నందన్ 3 వేల మీటర్లు , రిలే లో సతీశ్ 1500 మీటర్లు ప్రథమ స్థానంలో రాణించారు. 800 మీటర్ల పరుగు పందెంలో హేమంత్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. 200, 1500 మీటర్ల పరుగు పందెంలో సంధ్య, 200, 1500 మీటర్ల పరుగు పందెంలో పూర్ణిమ ప్రథమ స్థానంలో నిలిచారు. కీర్తన 1500 మీటర్లలో ద్వితీయ స్థానం, 400 మీటర్లలో తృతీయ స్థానంలో నిలిచి తాలూకా స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

బస్సు సదుపాయం కల్పించాలి

పావగడ: చెళ్లకెరె క్రాస్ వద్ద ఉన్న డిగ్రీ కళాశాలకు వెళ్లేందుకు బస్సు సదుపాయం కల్పించాలని కురుబరహళ్లి గేట్ వద్ద ఏర్పాటు చేసిన బాలికల హాస్టల్‌లో వసతి పొందుతున్న విద్యార్థినులు కోరారు. ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ గురువారం హాస్టల్‌ను తనిఖీ చేసిన సమయంలో విద్యార్థులు తమ సమస్యను వివరించారు. ఎమ్మెల్యే స్పందించి కేఎస్‌ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలతో మాట్లాడారు. హాస్టల్ వద్ద బస్సులు నిలపాలని ఆదేశించారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి


శాస్త్రవేత్తలకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్

లేపాక్షి: సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం పరమాణు జ్యోతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శాస్త్రవేత్తలు డాక్టర్ షియో ముకుంద్, స్మితాదఫౌతి హాజరై విజ్ఞాన శాస్త్రంలోని కొత్త పోకడలను వివరించారు. అనంతరం 9నుంచి 12వ తరగతి విద్యార్థులతో సమావేశమై చర్చాగోష్టి జరిపారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ వి.నాగరాజన్ పాల్గొన్నారు.

పోరాటంతోనే సమస్యల పరిష్కారం

పెనుకొండ: పోరాటంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలో యూటీఎఫ్ నాయకులు జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ జెండా ఎగురవేసి వందనం సమర్పించారు.

ప్రతి పంచాయతీలో పోటీలు నిర్వహించాలి

లేపాక్షి: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్, పీడీలతో సమావేశం నిర్వహించారు. ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతి పంచాయతీలో పోటీలు నిర్వహించాలన్నారు. ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దార్ బాబు, ఎంఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: కిరికెర ఐటీఐ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు, కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.అంగన్‌వాడీ పాఠశాల ఏర్పాటు చేయాలని, సిమెంట్ రోడ్డు, మురికి కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

మహిళా చట్టాలపై అవగాహన

రొద్దం: మోపర్లపల్లి గ్రామంలో అనంతశక్తి సొసైటీ న్యాయసలహాల మండలి ఆధ్వర్యంలో గురువారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. దిశ చట్టం ద్వారా ఎలా న్యాయం పొందవచ్చనే అంశంపై వివరించారు.

డ్రైవర్లకు జరిమానాలు

సోమందేపల్లి: మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రమణ గురువారం వైఎస్సార్ సర్కిల్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాక్టర్ నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా రూ.2వేలు, లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతున్న డ్రైవర్‌కు రూ.5వేల జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

రొద్దం: మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ సంచాలకులు క్రిష్ణయ్య గురువారం తనిఖీ చేశారు. ఎరువుల అధికంగా నిల్వలు ఉంచినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. రైతుల వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

టిప్పర్ డ్రైవర్‌పై దుండగుల దాడి

లేపాక్షి: లేపాక్షి వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో టిప్పర్ డ్రైవర్‌పై ఆకతాయిలు దాడి చేసి గాయపరిచినట్టు ఎస్ఐ మునీర్‌అహమ్మద్ గురువారం తెలిపారు. చిలమత్తూరు మండలంలోని గాండ్రాలపల్లికి చెందిన రాజశేఖర్‌రెడ్డి బుధవారం రాత్రి టిప్పర్‌లో రాళ్ల లోడు వేసుకుని లేపాక్షి నుంచి శిరివరం వెళుతున్నారు. జెడ్పీ పాఠశాల సమీపంలో ఆటోలో వచ్చిన 8 మంది దుండగులు అడ్డుకున్నారు. అగ్గిపెట్టె, బాషా హన్స్ ఉందా అని అడిగారు. తనవద్ద లేదని రాజశేఖరరెడ్డి సమాధానం ఇవ్వగా దుండగులు కత్తులతో బెదిరించారు. వారి నుంచి తప్పించుకునేందుకు యత్నించగా దాడి చేసి గాయపరిచారు. కొందరు డ్రైవర్లు ఇచ్చిన సమాచారంతో పోలీసులు గాలింపు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేపట్టారు.